RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే
దిన పత్రిక

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్  సంపుటి : 04  సంచిక : 228
సోమవారం, ఆగస్టు 03, 2026 , పేజీలు - 4  వెల : 2/-

కింద పడ్డానని ఆగిపోకు,
తిరిగి ప్రయత్నం చేస్తే
విజయం నీదే
- అబ్దుల్ కలాం

### ఇంజినీర్లను క్రిమినల్ వేస్ట్ అనడమే
# కాంగ్రెస్ విధానమా



**హైదరాబాద్, ఆగస్టు 2 :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (ఆదివారం) లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. ఇంజినీర్లను 'క్రిమినల్ వేస్ట్' అన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామెంట్స్‌పై ఈ లేఖ రాసినట్లు చెప్పుకొచ్చారు. ఒకవైపు భారతదేశ ఇంజినీర్లు ప్రపంచ కంపెనీలను నడుపుతుంటే, అంతరిక్షంలోకి రాకెట్లను పంపుతుంటే.. అలాంటి వారిని 'క్రిమినల్ వేస్ట్' అని రేవంత్‌రెడ్డి అనడం తగదని అన్నారు. దేశ ప్రగతికి పాటుపడుతూ లక్షల మందికి ఉద్యోగ ఉపాధిని అందిస్తున్న ఇంజినీర్లను క్రిమినల్ వేస్ట్ అని ఎలా అంటారని ప్రశ్నించారు. సీఎం చేసిన కామెంట్స్‌పైన స్పందించాల్సిన నైతిక, రాజకీయ బాధ్యత రాహుల్ గాంధీపై ఉందని చెప్పుకొచ్చారు.రాహుల్ గాంధీ ఈ అంశంలో మౌనంగా ఉండటమంటే రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను సమర్థించినట్లేనని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. రేవంత్‌రెడ్డితో వెంటనే సీఎం పదవికి రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. యువత రేపటి భారతదేశ నిర్మాతలు అనే విషయాన్ని రాహుల్ గాంధీ గుర్తుంచుకోవాలని అన్నారు. యువతతో పెట్టుకుంటే ఏమైందో రాహుల్ గాంధీ నానమ్మకి, ఇందిరమ్మ ఎమర్జెన్సీ సమయంలో, యుపీఏ తెలంగాణ ఉద్యమ సమయంలో తెలుసునని ప్రస్తావించారు. యువత తలుచుకుంటే ఆ పార్టీ మెడలు ఎలా వంచుతారో రాహుల్ గుర్తుంచుకోవాలని అన్నారు. తెలంగాణ యువత ఓట్లు అడిగి వారిని మభ్యపెట్టిన రాహుల్ గాంధీకి తన నైతిక బాధ్యతను గుర్తు చేయడానికే ఈ లేఖ రాస్తున్నానని స్పష్టం చేశారు.రేవంత్‌రెడ్డి చేసిన కామెంట్స్‌పైన స్పందించాల్సిన నైతిక, రాజకీయ బాధ్యత రాహుల్ గాంధీపై ఉందని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, నైతికత, యువతకు దక్కాల్సిన గౌరవం వంటి అంశాలపైన మాట్లాడే అర్హత కోల్పోయారని విమర్శించారు. యువత గురించి రాహుల్ గాంధీ చెప్పే ఊకదంపుడు ప్రసంగాలకు భిన్నంగా రేవంత్‌రెడ్డి విద్యార్థులను, ఇంజినీర్లను, టీచర్లను క్రిమినల్ వేస్ట్ అంటున్నారని ప్రస్తావించారు.దేశ ప్రగతికి పాటుపడుతున్న ఇంజినీర్లను క్రిమినల్ వేస్ట్ అనడమే కాంగ్రెస్ పార్టీ విధానమా? అని ప్రశ్నించారు. తెలంగాణ యువత కాంగ్రెస్ ముఖ్యమంత్రి చేస్తున్న అడ్డమైన వ్యాఖ్యలను గమనిస్తోందని అన్నారు.

### నామినేటెడ్ పోస్టులకు
# రంగం సిద్ధం



**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ శ్రేణులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఎట్టకేలకు అధికారికంగా వేగం పుంజుకుంది. గాంధీభవన్‌లో శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి సుదీర్ఘంగా సమావేశమై నామినేటెడ్ పోస్టుల భర్తీకి సంబంధించిన మార్గదర్శకాలు, విధివిధానాలను ఖరారు చేశారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల (పీఏసీఎస్) డైరెక్టర్లు, ఛైర్మన్ల పదవులతో పాటు మార్కెట్ కమిటీలు, దేవస్థాన కమిటీలు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఇతర కీలక నామినేటెడ్ పోస్టులను త్వరితగతిన, పారదర్శకంగా భర్తీ చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా పార్టీ కోసం కష్టపడిన వారికి ఈ పదవుల్లో పెద్దపీట వేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు.

### డ్రగ్స్ మహమ్మారి నుంచి యువతను
# కాపాడాలి



**న్యూ ఢిల్లీ :**భారత్ లక్ష్య సాధనలో యువత ఆరోగ్యమే అత్యంత కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. "వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్"లో భాగంగా చేపట్టిన మాదకద్రవ్య రహిత యువత కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని డ్రగ్స్ రహిత సమాజం దేశాభివృద్ధికి ఎంత అవసరమో వివరించారు. గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంబమైన ఈ కార్యక్రమం ఇప్పుడు 125 ఆధ్యాత్మిక సంస్థల సహకారంతో దేశవ్యాప్తంగా విస్తరిస్తోందన్నారు. యువత భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు కేంద్రప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందని చెప్పారు. ఈ ఉద్యమం కేవలం ఓ వ్యక్తి కోసమో, ఓ కుటుంబం కోసమో కాదని వాటన్నింటికి మించి దేశం కోసమని ప్రధాని మోదీ తెలిపారు. దేశం 'వికసిత్ భారత్' దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో యువత శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా, ఆత్మ విశ్వాసంతో ఉండటమే కాకుండా డ్రగ్స్ లాంటి మహమ్మారులకు దూరంగా ఉండటం అత్యంత ఆవశ్యకమని ప్రధాని సూచించారు. మాదక ద్రవ్యాల స్మగ్లర్లు, డ్రగ్స్? దుర్వినియోగంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ప్రధాని మోదీ చెప్పారు. అరెస్టులు గణనీయంగా పెరిగాయని, వేల కోట్ల రూపాయల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. డ్రగ్స్? వినియోగం వల్ల కలిగే తాత్కాలిక ఉత్సాహం మీ కెరీర్, వ్యక్తిగత జీవితాన్ని పూర్తిగా నాశనం చేస్తుందని అన్నారు. దేశ యువత మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని, ఇందుకోసం అన్ని రకాల డ్రగ్స్? వినియోగానికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.


### అలా హామీ ఇస్తేనే వచ్చే ఎన్నికల్లో పోటీ..
# లేకుంటే తప్పుకుంటా



**సికింద్రాబాద్:**వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీపై తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంక టరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తన సొంత నియోజకవర్గం నల్లగొండలోని ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన నియోజకవర్గ ఓటర్లకు ఓ కండిషన్ పెట్టారు. వచ్చే ఎన్నికల్లో తనను రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని మాట ఇస్తేనే తాను పోటీలో ఉంటానని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. ఒకవేళ స్పష్టమైన హామీ రాకుంటే అసలు ఎన్నికల ప్రక్రియ నుంచే తప్పుకుం టానని ప్రకటించి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు తెరతీశారు. స్వయంగా తాను ఎన్నికల ప్రచారానికి రాకపోయినా, ఇప్పటి వరకు నియోజక వర్గంలో తాను చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని చూసి ఓట్లు వేయాలని ఆయన పిలుపుని చ్చారు. ఈ క్రమంలో తన రాజకీయ జీవితం, సొంత ఆస్తుల గురించి కూడా మంత్రి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. సుదీర్ఘకాలం పాటు ఎమ్మెల్యేగా, పలుసార్లు మంత్రిగా ఉన్నపటికీ తనకు సొంత ఇల్లు, భారీగా ఆస్తులు లేవని ఆయన చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో తాను ఇప్పటికీ అద్దె ఇంట్లోనే నివాసం ఉంటున్నానని, తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తుల తప్ప తాను సొంతంగా సంపాదించుకున్నవి లేవని పేర్కొన్నారు. నల్లగొండ అభివృద్ధే తన ధ్యేయమని, పదవులు ఉన్నా లేకున్నా ప్రజల కోసమే పనిచేస్తానని వెంకటరెడ్డి పేర్కొన్నారు.

### సికింద్రాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన
# లష్కర్ బోనాలు

- వైభవోపేతంగా ఉజ్జయిని మహంకాళి బోనాలు
- అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి భక్తుల ప్రత్యేక పూజలు
- మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి



**సికింద్రాబాద్:**సికింద్రాబాద్‌లో లష్కర్ బోనాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయానికి విచ్చేసిన సీఎంకు నిర్వాహకులు మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. సీఎంతో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్?లు ఉన్నారు. కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించారుఅమ్మవారికి బంగారు బోనం సమర్పించిన పొన్నం : అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని, ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, బంగారు బోనం సమర్పించారు. అమ్మవారి కరుణా కటాక్షాలు ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. సమృద్ధిగా వర్షాలు పడాలని వేడుకున్నట్లు వివరించారు. భక్తులకు మహంకాళి అమ్మవారు దేదీప్యమానంగా దర్శనం ఇస్తున్నారు.భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు : తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించేందుకు ఉజ్జయిని మహంకాళి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆరు క్యూలైన్లను ఏర్పాటు చేసి అమ్మవారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నారు. బోనంతో వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో 2,500 మంది పోలీసులతో భద్రతను ఏర్పాటు చేశారు. 500 మంది ప్రత్యేక వాలంటీర్లు

### ఏపీ ప్రభుత్వం-ఆస్ట్రేలియా మధ్య
# 4 కీలక ఒప్పందాలు



**అమరావతి :** ఏపీ ప్రభుత్వం, ఆస్ట్రేలియాలోని ప్రముఖ విద్యా, పరిశోధన, పారిశ్రామిక సంస్థల మధ్య క్లీన్ ఎనర్జీ, సమ్మిళిత విద్య, మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాల్లో నాలుగు వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఇటీవల మంత్రి లోకేశ్ జరిపిన ఆస్ట్రేలియా పర్య టనలో భాగంగా అక్కడి ప్రతినిధులను ఆహ్వానించి, రాష్ట్రంలో ఉన్న రాయితీల ను వివరించిన ఫలితంగా ఈ చారిత్రాత్మక భాగస్వామ్యం సాధ్యమైంది.ఈ మేరకు ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి లోకేశ్, ఆస్ట్రేలియా సహాయ మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో ఈ ఎంవోయూలపై ఇరుపక్షాల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ ఒప్పందాల్లో భాగంగా విశాఖలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్, ఐఐటీ తిరుపతి, సిడ్నీకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ సంయుక్తంగా ఐఐటీ తిరుపతిలో 'సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయనున్నాయి. దీని ద్వారా ఏపీని సోలార్ పీవీ తయారీ, సోలార్ ప్యానెళ్ల రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ పరిశోధనలకు జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడమే కాకుండా, పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా యూఎన్ఎస్‌డబ్ల్యూ విద్యా శిక్షణా కార్యక్రమాలను రూపొందిస్తుంది.

### కృష్ణా, గోదావరి జలాలపై స్పష్టమైన
# విధానం ఉండాలి



**రాజమండ్రి, ఆగస్టు 02:** గోదావరి, కృష్ణా జలాల వివాదాల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.ఆదివారం) రాజమండ్రిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమిలో భాగస్వామ్య పార్టీలు వేరైనా, ప్రభుత్వాల బాధ్యత రైతుల ప్రయోజనాలను కాపాడటమేనని ఉద్ఘాటించారు.పోలవరం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో నిర్మించకపోతే విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉండదని కిరణ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పోలవరం ముంపు పరిధిలోని భూసేకరణ కోసం ఏపీ ప్రభుత్వం తక్షణమే ఆ రాష్ట్రాలతో సంప్రదింపులు ప్రారంభించాలన్నా రు. 'ఒడిశాలో భూసేకరణ కోసం అవసరమైతే 10 నుంచి 15 రెట్లు పరిహారం ఇచ్చినా నష్టం లేదు. ఈ విషయాన్ని నేను స్వయంగా సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లాను' అని వెల్లడించారు.కృష్ణా జలాల విషయంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్న ఆయన.. ఈ విషయంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. 'ముఖ్యమంత్రులు కలవడంలో తప్పులేదు, కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏం సాధిస్తున్నారనేదే ముఖ్యం' అని అన్నారు. గతంలో తాను కృష్ణా జలాల పరిరక్షణ కోసమే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశానని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు.

### ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను
# ప్రజా ఉద్యమంగా నిర్వహిద్దాం



**హైదరాబాద్, ఆగస్టు 2 :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ప్రజా ఉద్యమంగా నిర్వహి ద్దామని తెలంగాణ మంత్రి సీతక్క వ్యాఖ్యానిం చారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 'తల్లి పాలే శిశువుకు తొలి హక్కు.. తొలి టీకా' అని తెలిపారు. ఈరోజు(ఆదివారం) హైదరాబాద్ వేదికగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు.బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలి..బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలని మంత్రి పేర్కొన్నారు. మొదటి 6 నెలలు కేవలం ఈ పాలే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలపై అవగాహన పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ పాలపై ఉన్న అపోహలను తొలగిద్దామని తెలిపారు. ఆరోగ్యవంతమైన చిన్నారులే ఆరోగ్య తెలంగాణకు పునాది అని ఉద్ఘాటించారు. ప్రతి ఇంటికి 'తల్లి పాలే తొలి టీకా' సందేశం తీసుకెళ్లాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యంపై సమాజమంతా బాధ్యత తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు.

# శాకాంబరి దేవిగా భక్తులకు మైసమ్మ తల్లి దర్శనం.. వచ్చే వారం బోనాల పండుగ వైభవం!

**శేరి లింగంపల్లి, ఆగస్టు 02:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

శేరి లింగంపల్లి సర్కిల్ పరిధిలోని చందానగర్ డివిజన్, లింగంపల్లి నుండి అమీన్పూర్ వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న రాజేందర్ రెడ్డి నగర్ కాలనీలోని శ్రీ మైసమ్మ తల్లి ఆలయంలో ఆషాడ మాస వేడుకలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం అమ్మవారికి ఆలయ అర్చకులు పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పవిత్ర సందర్భం నందు అమ్మవారు ప్రత్యేకంగా శాకాంబరి దేవి అలంకరణలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. రకరకాల తాజా కూరగాయలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన అమ్మవారి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ విశేష పూజల్లో చుట్టుపక్కల కాలనీల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు



సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివ మీడియాతో మాట్లాడుతూ. “ఆషాడ మాసం సందర్భంగా ఈరోజు అమ్మవారిని భక్తుల కోర్కెలు తీర్చే శాకాంబరి దేవి అవతారంలో అలంకరించడం చాలా సంతోషంగా ఉంది. నిత్య జీవితంలో అన్నదాతలను, ప్రజలను చల్లగా చూసే ఆ తల్లి కటాక్షం అందరిపై ఉండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించాము. అలాగే, రాబోయే ఆదివారం (వచ్చే వారం) మైసమ్మ తల్లి బోనాల పండుగను ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నాము. ఈ ఉత్సవాల్లో భక్తులందరూ పెద్ద ఎత్తున పాల్గొని, అమ్మవారికి బోనాలు సమర్పించి, తల్లి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నాముఅని తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు, ప్రసాదం వితరణ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్షిప్ డే సందర్భంగా రక్షాబంధనం కట్టిన చేగుంట ఉపసర్పంచ్

- “నీవు నాకు రక్ష - నేను నీకు రక్ష - మనిద్దరం కలిసి దేశానికి రక్ష”



**చేగుంట, ఆగస్టు 02 మెదక్ టుడే న్యూస్**

ఫ్రెండ్షిప్ డే సందర్భంగా చేగుంట ఉపసర్పంచ్ మహ్మద్ రఫీ తన స్నేహితులతో కలిసి ఒకరికొకరు రక్షాబంధనాలు కట్టుకున్నారు. ఈ సందర్భంగా “నీవు నాకు రక్ష – నేను నీకు రక్ష – మనిద్దరం కలిసి దేశానికి రక్ష” అనే నినాదంతో ముందుకు వెళదామని సంకల్పం తీసుకున్నారు. కార్యక్రమంలో స్నేహితులందరూ కలిసి స్వీట్లు పంచుకొని సంతోషం వ్యక్తం చేశారు. అందరికీ ఫ్రెండ్షిప్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేగుంట ఉపసర్పంచ్ మహ్మద్ రఫీ, ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ కొండల్ రెడ్డి, చేగుంట గ్రామ రైతు నాయకుడు గాండ్ల శ్రీనివాస్, మైనార్టీ నాయకుడు మహ్మద్ నయీమ్ (టింక) గౌడ సంఘం నాయకులు వీరేశం గౌడ్ పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న చేగుంట ఉపసర్పంచ్ మహ్మద్ రఫీ

**- దేవాలయాలకు, వితంతు కుటుంబాలకు ప్రతి నెల ఆర్థిక సహాయం**





**చేగుంట ఆగస్టు 2 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలం చేగుంట గ్రామ ఉపసర్పంచ్ మహ్మద్ రఫీ తాను ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెల దేవాలయాలకు వితంతు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. ఈ నెలలో చేగుంట మహంకాళి దేవాల యానికి దూప, దీప, నైవేద్యాలకు 5000 రూపాయలు,వడియారం పెద్దమ్మ దేవాలయానికి 5000 రూపాయలు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి దూప, దీప, నైవేద్యాలకు 8000 రూపాయలు అందజేశారు. అదేవిధంగా చేగుంట గ్రామంలో చిన్న వయసులో మరణించిన బాధిత కుటుంబాలకు వితంతు పింఛన్ గా 2000 రూపాయల చొప్పున సహాయం చేశారు. గాయత్రి భర్త ప్రసాద్, పొట్టి వాణి భర్త శ్రీనివాస్, కుటుంబాలకు చెరో 2000 రూపాయల పెన్షన్ అందజేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మహ్మద్ రఫీ మాట్లాడుతూ “ప్రజలకు సేవ చేయడం కోసమే ఈ అవకాశం వచ్చింది. ఇలా సహాయం చేయగలుగుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కొనసాగిస్తాను” అని తెలిపారు. గ్రామస్తులు ఉపసర్పంచ్ రఫీ చేస్తున్న సేవను అభినందించారు.

# భానురు ధన మైసమ్మ బోనాల ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్న ఎమ్మెల్యే





**పటాన్‌చెరు, ఆగస్టు 02:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

పటాన్‌చెరు మండలం భానురు గ్రామంలో ఆదివారం శ్రీశ్రీశ్రీ ధన మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయాల అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోపాల్, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# “భక్తిశ్రద్ధలతో పాటి గ్రామ బోనాలు.. నాయకులు శాపురం నరసింహారెడ్డి దంపతుల ప్రత్యేక పూజలు!”





**పటాన్‌చెరు, ఆగస్టు 02:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని ముత్తంగి డివిజన్ పరిధిలోని పాటి గ్రామంలో బోనాల వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి. కాంగ్రెస్ పార్టీ ముత్తంగి డివిజన్ సీనియర్ నాయకులు శాపురం నరసింహారెడ్డి , వారి కుటుంబ సభ్యులు తమ స్వగృహంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. గ్రామ ప్రజల సుఖసంతోషాలు, రాష్ట్ర అభివృద్ధి, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి మంచి పంటలు పండాలని, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు మరియు ఐశ్వర్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు.

బోనాల వేడుకల సందర్భంగా పాటి గ్రామం పూర్తిగా పండుగ వాతావరణంతో కళకళలాడింది. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు సమర్పిస్తూ అమ్మవారిపై తమ భక్తిని చాటగా, యువత మరియు చిన్నారులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామంలోని ఆలయ పరిసరాలు భక్తజనాలతో నిండిపోయి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

సమాజంలో ఐక్యతకు బోనాలు ప్రతీక: శాపురం నరసింహారెడ్డి

ఈ వేడుకలకు పాటి గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, వివిధ కాలనీల మహిళలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామానికి వచ్చిన ప్రతి భక్తుడికి శాపురం నరసింహారెడ్డి , వారి కుటుంబ సభ్యులు ఆత్మీయంగా స్వాగతం పలికి ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాపురం నరసింహారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని, ప్రతి ఇంటా సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఇలాంటి సాంస్కృతిక, ఆధ్యాత్మిక వేడుకలు సమాజంలో ఐక్యత, సామరస్యం, పరస్పర ప్రేమాభిమానాలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి బోనాల ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక మొక్కులు చెల్లించారు. భక్తులు ‘జై మహంకాళి’ నినాదాలతో అమ్మవారిని స్మరిస్తూ ఉత్సాహంగా వేడుకలను నిర్వహించారు. పాటి గ్రామంలో జరిగిన ఈ బోనాల వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో ముగిశాయి.

# ఏడుపాయల అమ్మవారికి ఫలపుష్ప అలంకరణ

**మెదక్ టుడే న్యూస్ ఏడుపాయల, ఆగస్టు 2:**

మెదక్ జిల్లా ప్రతినిధి పి. దుర్గేష్ గౌడ్ ఏడుపాయల శ్రీ వనదుర్గా భవాని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పండ్లు, పుష్పాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. అరటి పండ్లు, ద్రాక్ష, ఆపిల్, నారింజ, దానిమ్మ, పుచ్చకాయ, పైనాపిల్ తదితర పండ్లతో రూపొందించిన ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి, అనంతరం మంగళహారతి నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఈ అద్భుతమైన ఫలాలంకరణను చూసి భక్తి పరవశానికి లోనయ్యారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అర్చకులు ఆకాంక్షించారు.



# మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు..

**- గ్రామ దేవతలకు బోనాల సమర్పణ**

**మెదక్ టుడే ఆగస్టు02:మెదక్ జిల్లా ప్రతినిధి పి. దుర్గేష్ గౌడ్**

మండల కేంద్రం పాపన్నపేటలో ఉన్న నల్ల పోచమ్మ, ముత్యాల పోచమ్మలకు ఆషాడ మాసం పురస్కరించుకొని ఆదివారం మున్నూరు కాపు సంఘం సభ్యులు బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో వేప కొమ్మలు, కుంకుమ, పసుపు, పూలు, నైవేద్యంతో అందంగా అలంకరించిన కుండలను మహిళలు నెత్తిన పెట్టుకొని గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. యువకులు, పోతురాజులు డీజే చప్పుల్ల మధ్య నృత్యం చేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం పెద్దలు, సభ్యులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బంధుమిత్రులతో సందడి వాతావరణం నెలకొంది.



## బీహెచ్ఈఎల్‌లో ఘనంగా బెస్త గంగపుత్ర సంఘం బోనాల వేడుకలు

**- పాల్గొన్న భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి**





**రామచంద్రాపురం, ఆగస్ట్ 02:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
ఆషాఢ మాస బోనాల మహోత్సవాల సందర్భంగా రామచంద్రాపురం పరిధిలోని బీహెచ్ఈఎల్‌లో బెస్త గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె సంఘ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం బెస్త గంగపుత్ర సంఘం సభ్యులు సంప్రదాయబద్ధంగా బోనాల ఊరేగింపు నిర్వహించి, బీహెచ్ఈఎల్ పెద్దమ్మ తల్లి ఆలయానికి బయలుదేరారు. అమ్మవారిని దర్శించుకుని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెస్త గంగపుత్ర సంఘం సభ్యులు రాజ్‌కుమార్, కిరణ్‌కుమార్, కృష్ణారావు, మదన్, ప్రవీణ్, శ్రీధర్‌తో పాటు భక్తులు, స్థానిక ప్రజలు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## చందానగర్ సుప్రజా రెసిడెన్స్‌లో మెగా ఫ్యామిలీ అభిమానుల ఆత్మీయ సమావేశం, రక్తదాతలకు సత్కారం





**శేరి లింగంపల్లి , ఆగస్టు 02:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
శేరి లింగంపల్లి నియోజవర్గ పరిధిలోని చందానగర్‌లోని సుప్రజా రెసిడెన్స్ వేదికగా ఆదివారం మెగాస్టార్ చిరంజీవి అభిమాన సంఘాల ఆధ్వర్యంలో మెగా ఫ్యామిలీ అభిమానుల ఆత్మీయ కార్యక్రమం ఘనంగా జరిగింది. మెదక్, రంగారెడ్డి జిల్లాల నుంచి భారీ సంఖ్యలో సీనియర్ అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిన అభిమానులకు ప్రత్యేకంగా ఘన సత్కారం అందించారు.ఈ కార్యక్రమానికి నూతనంగా ఎన్నికైన మెగా యూత్ ఫోర్స్ తెలంగాణ వెస్ట్ జోన్ కన్వీనర్ శ్రీ దంగేటి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన కొణిదెల సుస్మితకు, మెగా యూత్ ఫోర్స్ అధ్యక్షులు ఏడిద బాబికి, అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ రవణం స్వామి నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మెగా యూత్ ఫోర్స్ సభ్యులకు ఏ కష్టమొచ్చినా తన వంతు పూర్తి సహకారం అందిస్తానని, ఎప్పుడూ అందుబాటులో ఉంటూ మంచి కార్యక్రమాలలో తోడుగా ప్రయాణిస్తానని భరోసానిచ్చారు.రెండు జిల్లాల నుంచి సుమారు 350 మందికి పైగా అభిమానులు విచ్చేసిన ఈ వేడుకలో అందరికీ ఘనంగా భోజన ఏర్పాట్లు చేశారు. ఈ ఆత్మీయ సమావేశానికి తెలంగాణ వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ శ్రీ మిర్యాల రాఘవరావు, శేర్లింగంపల్లి జనసేన ఇంచార్జ్ శ్రీ మాధవ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేసి సందడి చేశారు. ఈ అద్భుత కార్యక్రమ నిర్వహణను తెలంగాణ వెస్ట్ జోన్ మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్, సత్య స్పోర్ట్స్ సెంటర్ అధినేత శ్రీ దంగేటి సత్యనారాయణ అద్భుతమైన రీతిలో సమన్వయం చేశారు.

## స్నేహబంధానికి ప్రతీకగా ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు

**- ఆనందోత్సాహాలతో స్నేహితుల సంబరాలు..**
**ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని శుభాకాంక్షలు**






**మెదక్,టుడే న్యూస్ ఆగస్టు 2:మెదక్ జిల్లా ప్రతినిధి పి దుర్గేష్ గౌడ్**
స్నేహబంధానికి ప్రతీకగా నిలిచే ఫ్రెండ్‌షిప్ డేను ఆదివారం జిల్లావ్యాప్తంగా స్నేహితులు ఘనంగా జరుపుకున్నారు. చిన్ననాటి స్నేహితుల నుంచి విద్యార్థులు, యువత వరకు పలువురు ఒకచోట చేరి తమ ఆత్మీయతను చాటుకున్నారు. స్నేహితులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టి, స్వీట్లు పంచుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. స్నేహితుల మధ్య అనుబంధాన్ని మరింత బలపరిచేలా పలువురు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. స్నేహితులతో కలిసి కేక్ కట్ చేసి, సరదాగా గడుపుతూ ఫొటోలు దిగారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. కొందరు తమ స్నేహితులకు పూలు, గ్రీటింగ్ కార్డులు, బహుమతులు అందించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. స్నేహం అంటే కేవలం కలిసి తిరగడం, మాట్లాడుకోవడం మాత్రమే కాదని.. జీవితంలో కష్టాలు ఎదురైనప్పుడు అండగా నిలిచి, సంతోష సమయాల్లో ఆనందాన్ని పంచుకోవడమే నిజమైన స్నేహమని పలువురు పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ తమ పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ, చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని తెలిపారు. స్నేహానికి కులం, మతం, ప్రాంతం, ఆర్థిక స్థాయి వంటి ఎలాంటి భేదాలు ఉండవని, నమ్మకం, ఆప్యాయత, గౌరవం, పరస్పర సహకారమే స్నేహబంధానికి పునాది అని అన్నారు. జీవితంలో ఎన్నో బంధాలు ఏర్పడినా నిజమైన స్నేహితుడు మాత్రం ఎలాంటి పరిస్థితుల్లోనైనా మన వెంట ఉంటాడని పేర్కొన్నారు.ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా స్నేహితులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ తమ స్నేహబంధం ఎప్పటికీ ఇలాగే కొనసాగాలని, జీవితాంతం ఒకరికొకరు అండగా నిలవాలని ఆకాంక్షించారు. దీంతో పలు ప్రాంతాల్లో ఆదివారం స్నేహితుల సందడితో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.

## ఆందోల్ నియోజకవర్గానికి రూ.19.15 కోట్లతో 9 బీటీ రోడ్లు మంజూరు

**- మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో అభివృద్ధికి మరో కీలక అడుగు**

**మెదక్ టుడే న్యూస్. 2 మెదక్ జిల్లా ప్రతినిధి పి. దుర్గేష్ గౌడ్**
ఆందోల్: ఆందోల్ నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడిందని వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ ఈ. రాంబాయి తెలిపారు. మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు రూ. 19.15 కోట్ల అంచనా వ్యయంతో 9 బీటీ రోడ్లు మంజూరు కావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.మొత్తం 22.50 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో గ్రామాలు, తండాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఈ రోడ్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో ఆందోల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడం అభినందనీయమని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని సర్పంచ్ ఈ. రాంబాయి అన్నారు. రోడ్ల నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేయాలని ఆమె కోరారు.ఆందోల్ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి దామోదర్ రాజనర్సింహ చేస్తున్న కృషికి వెంకటాపూర్ గ్రామ ప్రజల తరపున సర్పంచ్ ఈ. రాంబాయి కృతజ్ఞతలు తెలిపారు.




## స్నేహం కన్నా గొప్పది లేదు.. జీవితాంతం నిలిచే ఆత్మీయబంధం



**రాయపోల్, ఆగస్టు 02**: జీవితంలో స్నేహం కన్నా గొప్పది మరొకటి లేదని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ (అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రామారం, సయ్యద్ నగర్ తదితర గ్రామాల్లో పర్యటించిన ఆయన తన చిన్ననాటి స్నేహితులను పలకరించి వారికి శాలువాతో సన్మానించారు.చిన్ననాటి స్నేహితులను కలిసిన సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ మాట్లాడుతూ..స్నేహం అనేది రక్తసంబంధంకాదని.. కానీ జీవితాంతం నిలిచే ఆత్మీయబంధమని పేర్కొన్నారు.మన సంతోషంలో నవ్వుతూ, కష్టాల్లో అండగా నిలుస్తూ, ప్రతి అడుగులో తోడుగా ఉండేవారే నిజమైన స్నేహితులని ఆయన అన్నారు.మానవ జీవితాన్ని అందంగా మార్చిన ప్రతి స్నేహితుడికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు మాజీ ఎమ్మెల్సీ. స్నేహితులంటే తనకు ఎంతో ప్రాణమని. స్నేహితులు ఆపదల ఉంటే రాత్రింబవళ్లు అందుబాటులో ఉండి సేవ చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంప మహేందర్, సికిందర్, దౌల్తాబాద్.. రాయపోల్ ఉమ్మడి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చింతకింది మంజూరు, ఫారుక్ హుస్సేన్ స్నేహితులు పాల్గొన్నారు

## వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు విస్తృత పర్యటన

**- రైన్‌పల్లి వంతెన పరిశీలన.. శాశ్వత పరిష్కారానికి రూ.2.30 కోట్ల ప్రతిపాదనలు**
**- అత్యవసర మరమ్మతులకు రూ.15 లక్షలు.. అధికారులకు తక్షణ చర్యలపై ఆదేశాలు**





**మెదక్,టుడే న్యూస్ ఆగస్టు 2:** మెదక్ జిల్లా ప్రతినిధి పి. దుర్గేష్ గౌడ్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు ఆదివారం వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, రవాణా మార్గాలను పరిశీలించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ముందుగా రైన్‌పల్లి వంతెనను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెన దెబ్బతిన్న పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంతెనకు శాశ్వత పరిష్కారంగా పూర్తిస్థాయి పునర్నిర్మాణానికి సుమారు రూ. 2.30 కోట్ల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అప్పటివరకు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అత్యవసర మరమ్మతుల కోసం రూ. 15 లక్షలు మంజూరు చేయించి పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు.వర్షాకాలం పూర్తయ్యే వరకు వంతెన వద్ద భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని, బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి వేళల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అనంతరం మల్కాపూర్ తండాలో ఇటీవల వర్షాల సమయంలో స్కూల్ బస్సు చిక్కుకున్న ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యార్థుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.హవేలీ ఘన్‌పూర్ మండలం దూప్‌సింగ్ తండాలో సుమారు రూ. 3 కోట్లతో నిర్మించిన వంతెనను పరిశీలించిన ఎమ్మెల్యే.. నిర్మాణ నాణ్యత, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను అధికారులతో సమీక్షించారు. వంతెన అందుబాటులోకి రావడంతో తండా ప్రజలు, రైతులు, విద్యార్థులకు రాకపోకలు సులభతరమయ్యాయని తెలిపారు.తదుపరి బర్గ్‌పల్లి గ్రామంలో పిడుగుపాటుకు మృతి చెందిన శ్రీనివాస్ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తరఫున అందాల్సిన సహాయాన్ని త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం ముక్తా భూపతిపూర్ గ్రామంలో జరిగిన కుటుంబ కార్యక్రమంలో పాల్గొని స్థానిక ప్రజలను కలుసుకున్నారు. గ్రామస్థులు తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల భద్రత, అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. వర్షాల కారణంగా ఎక్కడ సమస్యలు తలెత్తినా అధికారులు వెంటనే స్పందించాలని, రోడ్లు, వంతెనలు, డ్రైనేజీ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. తాత్కాలిక మరమ్మతులతో పాటు శాశ్వత పరిష్కారాలకు అవసరమైన నిధులు తీసుకువచ్చి పనులు పూర్తి చేస్తామని తెలిపారు.మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు స్పష్టం చేశారు.ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెదక్ టుడే దిన పత్రిక
సోమవారం, 03 ఆగస్టు 2026

# ఇంజనీర్లపై రేవంత్ రెడ్డి అభ్యంతరకర కామెంట్స్‌కు
## రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి కేటీఆర్ బహిరంగ లేఖ



**హైదరాబాద్:** ఇంజనీరింగ్ విద్యార్థులనుద్దేశించి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేసిన అభ్యంతరకర కామెంట్స్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, పార్టీ నేత రాహుల్‌కు కేటీఆర్ ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ఇంజ నీరింగ్ విద్యార్థులను, ఇంజనీర్లను "క్రిమినల్ వేస్ట్" అన్న ముఖ్యమంత్రి కామెంట్స్‌పై రాహు ల్ మౌనం వీడి క్షమాపణ చెప్పాలని, లేదంటే రేవంత్ వ్యాఖ్యలను సమర్థించినట్టే అవుతుం దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తేల్చి చెప్పారు. ఇంజనీర్లు, భారతదేశ ఇంజనీర్లు ప్రపంచ కంపెనీలను నడుపుతుంటే, అంత రిక్షంలోకి రాకెట్లను పంపుతుంటే... అలాంటి వారిని "క్రిమినల్ వేస్ట్" అని రేవంత్ రెడ్డి అంటున్నారని, దేశ ప్రగతికి పాటుపడుతూ లక్షల మందికి ఉద్యోగ ఉపాధిని అందిస్తున్న ఇంజనీర్లను రేవంత్ అవమానపరిచారని కేటీఆర్ ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్ పైన స్పందించాల్సిన నైతిక, రాజకీయ బాధ్యత రాహుల్ గాంధీపై ఉందని. ఈ అంశంలో రాహుల్ గాంధీ మౌనంగా ఉం డడం అంటే రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను సమ ర్థించినట్లే అని కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రితో పాటు ఇంతటి దిగజారుడు ముఖ్యమంత్రిని రాష్ట్రంలోకి పంపిన రాహుల్ గాంధీ సైతం రాజీనామా చెప్పాలని ఆయన డిమాండ్. చేశారు.'నేటి యువత రేపటి భారతదేశ నిర్మాతలు' అన్న విషయాన్ని రాహు ల్ గాంధీ గుర్తుంచుకోవాలని కేటీఆర్ సూచిం చారు. యువతతో పెట్టుకుంటే ఏమైందో రాహుల్ గాంధీ నానమ్మ ఇందిరమ్మకు ఎమర్జె న్సీ సమయంలో, తెలంగాణ ఉద్యమ సమ యంలో యూపీఏ ప్రభుత్వానికి తెలుసని ఆయన గుర్తు చేశారు. యువత తలుచుకుంటే తమ పార్టీ మెడలు ఎలా వంచుతారో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గుర్తుంచుకోవాలి. తెలంగాణ యువత ఓట్లు అడిగి వారిని మభ్య పెట్టిన రాహుల్ గాంధీకి తన నైతిక బాధ్య తను గుర్తు చేయడానికే ఈ లేఖ రాస్తున్నా. రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్ పైన స్పంది ంచాల్సిన నైతిక, రాజకీయ బాధ్యత రాహుల్ గాంధీపై ఉన్నది.రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, నైతికత... యువతకు దక్కా ల్సిన గౌరవం వంటి అంశాలపైన మాట్లాడే అర్హత కోల్పోయారు. యువత గురించి రాహుల్ గాంధీ చెప్పే ఊకదంపుడు ప్రసం గాలకు భిన్నంగా రేవంత్ రెడ్డి విద్యార్థులను, ఇంజనీర్లను, టీచర్లను క్రిమినల్ వేస్ట్ అంటున్నాడు. ఇప్పటిదాకా రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డిని క్షమాపణ చెప్పాలని ఆదేశించకపోవడం, రేవంత్ రెడ్డి తరపున రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పకపోవడం... ఆ వ్యాఖ్యలను సమర్థించినట్లే. కేవలం ప్రసంగాలతో నాయకత్వం స్థాయి పెరగదని రాహుల్ గాంధీ గుర్తించాలి. కాంగ్రెస్ పార్టీ విధానాలతోనే చేసిన తప్పులను సరిది ద్దుకోవడంతోనే పెరుగుతుందని గుర్తించి రాహుల్ గాంధీ స్పందించాలి. తమ పార్టీ ముఖ్యమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలకు విద్యార్థులకు, గురువులకు, ఇంజనీర్లకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి. కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు తనకు సంబంధం లేదని రాహుల్ గాంధీ చెప్పజాలడుయువత గురించి ఊకదంపుడు ప్రసంగాలు చేసే హక్కు రాహుల్ గాంధీకి లేదు. . ఇదే తెలంగాణ యువత కేసీఆర్ నా యకత్వంలో కాంగ్రెస్ మెడలు వంచి తెల ంగాణ సాధించుకున్నారని రాహుల్ గాంధీ గుర్తుంచుకోవాలి. దేశ ప్రగతికి పాటుప డుతున్న ఇంజనీర్లు క్రిమినల్ వేస్ట్ అనడమే కాంగ్రెస్ పార్టీ విధానమా రాహుల్ చెప్పాలి. తెలంగాణ యువత మీ ముఖ్యమంత్రి చేస్తున్న అడ్డమైన వ్యాఖ్యలను గమనిస్తోంది, గుర్తుం చుకుంటుంది. రేవంత్ రెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థులనే కాకుండా ఇంజనీరింగ్ టీచర్లను తప్పుగా మాట్లాడారు. యువతపైన, విద్యా ర్థులపైన అడ్డగోలుగా నోరు పారేసు కోవడం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారి ంది. తెలంగాణ యువత ఆత్మగౌరవం పైన, ఆత్మ విశ్వాసం పైన రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నాడు. దేశ ప్రగతి కోసం తమ జీవితాన్ని ధారపోస్తున్న అధ్యాపక గురువులను కూడా రేవంత్ రెడ్డి తక్కువ చేసి మాట్లాడారు. రేవంత్ రెడ్డి గతంలో ఇలాగే యూనివర్సిటీ విద్యార్థులను "బీరు బిర్యానీ బ్యాచ్" అన్నారు. వారి రాజకీయ ఉద్యమాలను తక్కువ చేసి మాట్లాడారు. ఎవరు ప్రశ్నిస్తే వారిని తిట్టడం రేవంత్‌కి అలవాటు అయింది. విద్యార్థులను, ఇంజనీర్లను, టీచర్లను క్రిమినల్ వేస్ట్ అంటు న్నాడు. రేవంత్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యలే కాబట్టి, రాహుల్ గాంధీ అన్ కండిషనల్ క్షమాపణ విద్యా ర్థులకు, యువ తకు చెప్పాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం వెంటనే విద్యార్థులకు, గురువులకు క్షమాపణ చెప్పాలి. ఇంజనీర్లు, గురువులు క్రిమినల్ వేస్ట్ కాదు... యువతను అడుగ డుగునా, నిలువునా మోసం చేసిన కాంగ్రెస్సే అసలు సిసలు క్రిమి నల్ వేస్ట్! విద్యార్థులను, ఇంజనీర్లను క్రిమినల్ వేస్ట్ అన్న రేవంత్ మాటలు ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీ మాటలే. ఇప్పటికే మీ హామీల పేరుతో మోసపోయిన యువత అన్ని గుర్తుం చుకుంటుంది. సరైన సమయంలో తగిన సమాధానం చెబుతుందని గుర్తుంచుకోవాలి అని తన లేఖలో కాంగ్రె స్ పార్టీని కేటీఆర్ హెచ్చరించారు.

# తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు
## ప్రతీక బోనాల ఉత్సవాలు తలసాని



సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల వేడుకల్లో మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తలసానికి స్వాగతం పలికారు. ముందుగా ఆలయ పండితులు పూర్ణకుం భంతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శి ంచుకుని పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వ దించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ఓం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి రైతులు, ప్రజలు ఇబ్బందులు పడు తున్నారని అన్నారు. పుష్కలంగా వర్షాలు కుం వాలని పంటలు పాడిపంట చల్లగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. తెలం గాణసంస్కృ తి,సాంప్రదాయా లకు ప్రతీక బోనాల ఉత్సవాలు అని పేర్కొ న్నారు. తెల్లవా రుజాము నుంచే అమ్మవారి దర్శనం, బోనాలు సమర్పించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారని చెప్పారు.సమైక్య రాష్ట్రంలో బోనాల పండును పట్టిం చుకోలేదని తలసాని గుర్తుచేశారు. బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని డిమాండ్ ఉన్నప్పటికీ చేయ లేదని తెలిపారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం బోనాల ఉత్సవాలను రాష్ట్రపండు గగా ప్రకటించి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనం గా నిర్వహిస్తూ వస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం లో మహంకాళి అమ్మవారి కి బంగారు బోనం సమర్పించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.గోల్కొండ నుంచి లాల్‌దర్వాజ వరకు అంగరంగ వైభవంగా బోనాలు జరిపించారని పేర్కొన్నారు. లక్షలాది గా వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా నెల రోజుల నుండి అన్ని ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. 200 సంవత్సరాల చరిత్ర కలిగిన మహంకాళి అమ్మవారి భక్తులకు 100 సంవత్సరాల నుండి డెక్కన్ మానవ సేవా సమితి ఆధ్వర్యంలో సేవలు అందిస్తూ వస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

# లష్కర్ బోనాల జాతర షురూ
## ఉజ్జయిని మహంకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు



**హైదరాబాద్:** లష్కర్ బోనాలు అంగరంగ వైభవంగా ప్రార ంభమయ్యాయి. సికింద్రాబా ద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పి ంచేందుకు ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. ఆలయానికి వస్తున్న భక్తులతో పరిసర ప్రాం తాలు కిక్కిరిసిపోయాయి.ఇదిలా ఉంటే.. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు తొలి బోనం, పట్టు వస్త్రాలు సమ ర్పించారు. కాగా, భక్తుల రద్దీ దృష్ట్యా అధికా రులు అన్ని ఏర్పాట్లు చేశారు. సాధారణ భక్తు ల కోసం మూడు క్యూలైన్లు, బోనాలు సమ ర్పించేందుకు వచ్చిన భక్తుల కోసం రెండు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. అలాగే వీఐపీలకు మరో క్యూలైన్ ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక సెంట ర్లను ఏర్పాటుచేశారు. బందోబస్త్‌లో సుమారు 1500 మంది పాల్గొ న్నట్లు తెలుస్తోంది. కాగా, లష్కర్ జాతర సందర్భంగా ఇవాళ అమ్మవారికి బోనాలు సమర్పించగా.. రేపు సోమ వారం నాడు రంగం, అంబారీపై అమ్మ వారి ఊరేగింపు కార్య క్రమాలు నిర్వహి ంచనున్నారు.

**ఆలయ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు**


ఇదిలా ఉంటే.. లష్కర్ బోనాల దృష్ట్యా సికిం ద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షల ను అమలు చేస్తున్నారు. భక్తుల రద్దీ నేపథ్య ంలో 4వ తేదీ వరకు ఆలయం చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలో ట్రాఫిక్ మళ్లిం పులు, ఆంక్షలు అమలు చేస్తున్నామని ట్రాఫిక్ జాయి ంట్ కమిషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. జాతర సందర్భంగా 1వ తేదీ అర్ధరాత్రి ఒంటిగంటల నుంచి 4వ తేదీ ఉదయం వరకు పొగాకుబజార్, హమాలీ విగ్రహం నుంచి మహంకాళి ఆలయానికి వెళ్లే రహ దారులు, సుభాష్‌రోడ్ , హిల్ స్ట్రీట్, అద వియ్య క్రాస్‌రోడ్స్ నుంచి మహంకాళి ఆల యానికి వెళ్లే దారి, జనరల్‌బజార్ నుంచి మహంకాళి ఆలయానికి వెళ్లే దారిని మూ సివేస్తామని చెప్పారు. ముఖ్యంగా కర్బాలా క్రాస్రోడ్స్ వద్ద చిల్డ్రన్‌పార్క్ నుంచి వచ్చే వాహనాలను రాణి గంజ్‌వైపు మళ్లిస్తారు. రాణిగంజ్ క్రాస్‌రోడ్స్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వైపు కర్బాలా మైదాన్ నుంచి సికిం ద్రాబాద్ రైల్వే స్టేషన్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు లు,సాధారణ వాహ నాలు రాణిగంజ్ క్రాస్‌రో డ్స్ వద్ద మినిస్టర్ రోడ్డు , గోపాలపురం లైన్ మీదుగా రైల్వే స్టేషన్‌కు వెళ్లాలి.

# కులాలకు అతీతంగా జరిపే
## అద్భుత పండుగ బోనాలు కేటీఆర్



**సికింద్రాబాద్:** సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దర్శించుకున్నారు. అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కేటీఆర్‌కు తలసాని శ్రీనివాస్ యాదవ్ శాలువా కప్పి సత్కరించా రు. కేటీఆర్‌కు జ్ఞాపికను బహూకరించారు. కులాలకు అతీతంగా జరిపే అద్భుతమైన పం డుగ బోనాలు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్ అన్నారు. అమ్మకు బోనం సమ ర్పించి మొక్కులు చెల్లించుకుంటామని తెలిపా రు. కానీ సమైక్య రాష్ట్రంలో బోనాలను పట్టిం చుకోలేదని.. రాష్ట్ర పండుగ్గా గుర్తించలేదని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ బోనాలకు రాష్ట్ర పండుగ హోదా కల్పించారని అన్నారు. తెలంగాణ సాధించిందే ఆ తల్లి ఆశీ స్సులతోనని కేసీఆర్ చెప్పారని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి గుడికి రూ.25 కోట్ల నిధులు విడుదల చేశామని తెలిపారు. ఆల య కమిటీలకు డబ్బులిచ్చి.. పండుగలను ఘనంగా నిర్వహించామని చెప్పారు. రాష్ట్రంలో వర్షాలు బాగా పడాలని తల్లికి మొక్కుతున్నామని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రం పచ్చగా ఉండాలని, రైతులు బాగుండాలని అమ్మను వేడుకున్నామని చెప్పారు.

# ఆహారంలో పురుగులు హాస్టల్‌లో ఉండలేమంటూ అర్ధరాత్రి
## గురుకులం గోడ దూకి ముగ్గురు విద్యార్థినుల పరార్



**హనుమకొండ:** ఆహారంలో పురుగులు వస్తు న్నాయని.. ఇక్కడ ఉండలేమంటూ ముగ్గురు విద్యార్థినులు హాస్టల్ నుంచి పారిపోయారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండ లంలోని మందా రిపేట శివారులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీ వీబీ) నుంచి అర్ధరాత్రి గోడదూకి బయటకు వెళ్లిపోయారు. ఈ ఘటన ఉమ్మడి వరంగల్ జిల్లాలో కలకలం రేపింది. శనివారం అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో ముగ్గురు విద్యార్థినులు హాస్టల్ ప్రహరీ గోడ దాటి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పాం శాల సిబ్బంది, పోలీసులు, తల్లిదండ్రులు వెం టనే గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం గోవిందాపూర్ వెళ్లే మార్గంలోని చెట్ల పొదల్లో దాక్కున్న విద్యార్థినులను తల్లిద ండ్రులు గుర్తించి సురక్షితంగా తీసుకొచ్చారు. విద్యార్థినులు తెలిపిన వివరాల ప్రకారం.. హాస్టల్‌లో అందించే అల్పాహారంలో పురు గులు వస్తున్నాయని, బాత్రూంలు అపరిశు భ్రంగా ఉన్నాయని, కొద్దిసేపు ఆలస్యంగా నిద్ర లేస్తే కఠినమైన శిక్షలు విధిస్తున్నారని వాపోయారు. ఈ పరిస్థితుల్లో అక్కడ ఉండ లేకనే బయటకు వచ్చామని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠ శాలకు చేరుకుని ప్రిన్సిపాల్, సిబ్బంది తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్ధరాత్రి ముగ్గురు విద్యార్థినులు గోడ దూకి బయటకు వెళ్తుంటే సిబ్బంది ఏం చేస్తున్నారని నిల దీశా రు. హాస్టల్‌లో ఆహారం, పారిశుద్ధ్యం, భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఎస్ఎల్బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి
## చేయడమే నా లక్ష్యం మంత్రి కోమటిరెడ్డి



**నల్లగొండ :** ఎస్ఎల్బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేయడమే తన లక్ష్యమని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. ఎస్ఎల్బీసీ సొరంగం మార్గం ద్వారా రెండు పంటలకు నీరు ఇచ్చి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. నల్లగొండ మండలం కంచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి ప్రారం భించారు. ఈ సందర్భంగా మంత్రి కోమ టిరెడ్డి మాట్లాడారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజె క్టు ద్వారా ఈ ప్రాంతంలో ప్రతి ఎకరానికి సాగునీరు అందజేస్తామని చెప్పుకొ చ్చారు.కం చనపల్లి గ్రామాన్ని మోడల్‌గా అభివృద్ధి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. దోమలపల్లి గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేస్తామని తెలిపారు. మూడేళ్లు నల్గొండ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. వారానికి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

# దేశంలోనే నెంబర్ వన్‌గా తెలంగాణ మీసేవ




**హైదరాబాద్:** ప్రభుత్వ సేవలు, లావాదేవీలను ఆన్‌లైన్‌లో ఒకే వేదిక మీద అందిస్తోన్న రాష్ట్ర మీసేవ మరొక రికార్డును నమోదు చేసింది. దీనిద్వారా శుక్రవారం ఒక్కరోజే 2,20,172 లావాదేవీలు నమోదు అయ్యాయి. ఇలా ఒక్కరోజులో రికార్డు స్థాయిలో ఎలాంటి అంత రాయాలు లేని లావాదేవీల ద్వారా దేశంలోనే నెంబర్ వన్ గవర్నమెంట్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫా మ్‌గా రాష్ట్ర మీసేవ నిలిచిందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈమేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మీసేవ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను మరింతగా అభివృద్ధి చేయడం, సేవలను విస్తృత పరచడం, ఆమేరకు ప్రజల వినియోగాన్ని ప్రోత్సహించడంలో ప్రజాప్రభు త్వం చొరవ చూపిస్తోందని, దాంతో కొత్త రికా ర్డులు నమోదవుతున్నాయన్నారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ప్రజా
## ఉద్యమంగా నిర్వహిద్దాం మంత్రి సీతక్క



**హైదరాబాద్:** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ప్రజా ఉద్యమంగా నిర్వ హిద్దామని తెలంగాణ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా తల్లిపాల వారో త్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 'తల్లి పాలే శిశువుకు తొలి హక్కు.. తొలి టీకా' అని తెలిపారు. హైదరాబాద్ వేదికగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు.

**బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలి..**

బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలని మంత్రి పేర్కొన్నారు. మొదటి 6 నెలలు కేవ లం ఈ పాలే ఇవ్వాలని సూచించారు. తల్లి పాలపై అవగాహన పెంచాలని అధికా రుల ను ఆదేశించారు. ఈ పాలపై ఉన్న అపో హలను తొలగిద్దామని తెలిపారు. ఆరోగ్య వంతమైన చిన్నారులే ఆరోగ్య తెలంగాణకు పునాది అని ఉద్ఘాటించారు. ప్రతి ఇంటికి 'తల్లి పాలే తొలి టీకా' సందేశం తీసుకెళ్లాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యంపై సమా జమంతా బాధ్యత తీసుకోవాలని మంత్రి సీత క్క సూచించారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..